# 12

# “మెల్-కి-సె-దెకు-ఎవరు?”

## (7:1-8:2)

లేవీ యాజకత్వం కంటే క్రీస్తు యాజకత్వం గొప్పదన్న వాదనలో అసలు విషయానికి మనం వచ్చాము. ఈ విషయమును “నిరంతరము మెల్కీసెదెకు క్రమము చొప్పున ప్రధాన యాజకుడైన యేసు” అన్న మాటలతో గ్రంథకర్త ప్రారంభిస్తున్నాడు. ఈ విషయాన్ని 5వ అధ్యాయములో రెండుసార్లు ప్రస్తావిస్తున్నాడు (6, 10 వచనాలు). అక్కడితో ఆగి తన పాఠకులు ఆత్మీయ ఘనాహారం తీసుకోవడానికి సిద్ధంగా లేరని (చూడు 5:12-14) - అనగా, ఇప్పుడు చర్చించబోయే కష్టకర అంశములను గ్రహించేందుకు సిద్ధంగా లేరని చెప్తున్నాడు. తరువాత, ఆత్మీయంగా ఎదుగకపోవడంవలన కలిగే నష్టమును వివరిస్తున్నాడు. తరువాత తన ప్రోత్సాహకర మాటలను ముగిస్తూ “మెల్కీసెదెకు క్రమము చొప్పున యేసు ప్రధాన యాజకుడు” (6:20) అని చెప్తున్నాడు. చివరకు, ఈ మాటల ప్రాధాన్యతను అతడు వివరిస్తున్నాడు. దీనిని 7వ అధ్యాయములో చూస్తున్నాము.

మెల్కీసెదెకు ఎవరు అని ప్రజలను అడిగితే వారు “మెల్-కి-సె-దెకు-ఎవరు?” అని సమాధానమిస్తారు. పాత నిబంధనలోని ఈ పాత్ర “మర్మయుక్త మెల్కీసెదెకుగా” పిలువబడుతుంది. “అతడు తండ్రిలేనివాడును తల్లిలేనివాడును, వంశావళి లేనివాడును, జీవితకాలమునకు ఆదియైనను జీవమునకు అంతమైనను లేనివాడుగానున్నాడు” (7:3) అన్న వాక్యభాగం ఎన్నో ఏళ్ళుగా ప్రజలకు ఒక మర్మముగానే మిగిలి పోయింది. ఈ మెల్కీసెదెకు ఎవరు? యేసు క్రీస్తు ఈయన క్రమములోనే ప్రధానయాజకుడు అయ్యాడు అని గ్రంథకర్త చెప్పడంలో అతని ఉద్దేశం ఏమిటి? ఈ పాఠములో వీటికి సమాధానములను రాబట్టుదాం.

### మూడు వాక్య భాగములు

హెబ్రీ పత్రిక గాకుండా మెల్కీసెదెకు గురించి లేఖనాలలో రెండు వాక్యభాగములు మనకు కనబడుతున్నాయి. అతడు అబ్రాహామును కలిసిన సందర్భం ఆదికాండము 14:18-20 మరియు కీర్తన 110:1-4 వాక్య భాగం, ఇదే హెబ్రీయులకు 7:1-28లో ఉదహరించ బడింది. ఈ వాక్య భాగములను పరిశీలించుదాము.

### వివరించబడిన యాజకత్వం (ఆదికాండము 14:18-20)[1]

ఆదికాండములోని మూడు వచనములు మెల్కీసెదెకును గురించిన సమాచారాన్ని యిస్తున్నాయి. మెల్కీసెదెకు “షాలేము రాజుగా” మరియు “సర్వోన్నతుడైన దేవుని యాజకునిగా” ఇక్కడ కనబడుతున్నాడు. కొంతమంది రాజులమీద యుద్ధం చేసి వారిని గెలిచి తిరిగి వస్తున్న అబ్రాహామును ఇతడు దీవిస్తున్నాడు. యుద్ధంలో తాను గెల్చిన వాటిలో పదియవ వంతును అబ్రాహాము మెల్కీసెదెకుకు యిచ్చాడు.

మెల్కీసెదెకు లేవీ గోత్రంవాడు కాదు. (ఇతని తరువాతి కాలంలో లేవీ జన్మించాడు.) దీని

ఆధారంగా, ఎలా ఇతడు యాజకుడు అయ్యాడు అన్న విషయం ఇక్కడ చెప్పబడలేదు. కానీ ఇతని యాజకత్వం వంశక్రమమును అనుసరించింది కాదు అన్నది స్పష్టం అవుతుంది.

**ప్రవచింపబడిన యాజకత్వం (కీర్తన 110:1–4)**

కీర్తన 110 మెస్సీయాను గురించిన కీర్తన.[2] దీని వాక్య భాగములు క్రొత్త నిబంధనలో ఉదహరించబడ్డాయి. హెబ్రీయులకు 1:13లో గ్రంథకర్త కీర్తన 110:1 వాక్య భాగమును ఉదహరించి ఆ మాటలను యేసునకు అన్వయింపజేశాడు. కీర్తన 110లో మెస్సీయా ఒక రాజుగా ప్రవచించబడ్డాడు (1–3 వచనాలు) మరియు యాజకునిగా (4 వ.) "మెల్కీసెదెకు క్రమము చొప్పున" చెప్పబడ్డాడు (6:20).

**సంపూర్ణమైన యాజకత్వం (హెబ్రీయులకు 7:1–28)**

ఇప్పుడు హెబ్రీయులకు 7వ అధ్యాయమునకు వస్తున్నాము. ఇక్కడ ఆదికాండములో వివరించబడి తరువాత కీర్తనలలో ప్రవచింపబడిన విషయం యేసునందు సంపూర్తియైనదని గ్రంథకర్త వివరిస్తున్నాడు. *యేసు* "మెల్కీసెదెకు క్రమము చొప్పున నిరంతరము యాజకుడైయున్నాడు."

## ఆరు పోలికలు

యేసును మన ప్రధానయాజకునిగా చూపించుటకు ముందు ఆయన నిజంగానే యాజకుడని నిరూపించుటకు గ్రంథకర్త అహరోను క్రమము గాక, మెల్కీసెదెకు క్రమము చొప్పున ఆయన యాజకుడు అని వివరిస్తున్నాడు. ఏ విధంగా యేసు మెల్కీసెదెకు వంటి యాజకుడు? వారి యాజకత్వంలోని పోలికలను హెబ్రీయులకు 7 చూపిస్తుంది.[3]

**వారి రాజరిక స్వభావం**

లేవీ యాజకత్వము ప్రకారము యాజకత్వం మరియు రాజరికము రెండూ విభిన్న వ్యవస్థలు. మెల్కీసెదెకు ఈ రెండింటిని కలిపి యాజకరాజు అయ్యాడు (7:1). అలాగే, యేసు కూడ యాజకుడు (7:17; 8:1) మరియు రాజు. ప్రకటన గ్రంథంలో గొఱ్ఱెపిల్లయైన క్రీస్తు "ప్రభువులకు ప్రభువు మరియు రాజులకు రాజుగా" వివరించబడ్డాడు (ప్రకటన 17:14; 19:16; పోల్చు 1 తిమోతి 6:15).

**వారి నైతిక స్వభావము**

మెల్కీసెదెకు యొక్క పేరు మరియు అతని స్థానం నీతి మరియు సమాధానము అను లక్షణాలను స్పష్టం చేస్తున్నాయి (హెబ్రీయులకు 7:2). అబ్రాహాము అతనికి తాను కొల్లగొన్న శ్రేష్ఠమైన వస్తువులలో పదియవవంతును యిచ్చాడు. అతడు యిచ్చింది, ఇవ్వాలన్న నియమం ప్రకారం (చట్ట ప్రకారం) కాదుగాని, ఇవ్వాలనుకుని మాత్రమే ఇచ్చాడు (4 వ.; ఆదికాండము 14:17–20).

లేవీ యాజతక్వములో నైతికత్వపు ఆనవాళ్ళు ఉండాల్సిన విధి లేదు. యాజకుడు అవ్వాలంటే అతడు ఆ వంశపువాడైయుండాలి. ఒక వ్యక్తి రక్త సంబంధం ప్రకారం వారసుడు

అయితే అతడు యాజకుడు అవుతాడు (అతనికి శారీరక తేడా ఏమీలేనట్లయితే) ఒక వ్యక్తి ఎంత భక్తిపరుడయినను గాని అతనికి ఆ వంశ క్రమము లేనట్లయితే, అతడు యాజకడు కాలేడు. అయితే మెల్కీసెదెకు వలె యేసు క్రీస్తుకున్న ప్రత్యేక లక్ష్యణం ఆయన వంశక్రమము గాక ఆయన నైతిక జీవితము (16, 26 వచనాలు).

**వారి గోత్రేతర స్వభావము**

ఆదికాండములో మెల్కీసెదెకును గురించి ఇయ్యబడిన కొన్ని వచనాలలో అతని గురించిన వ్యక్తిగత వివరాలు ఇయ్యబడలేదు: అతడు ఎక్కడినుండి వచ్చాడు లేదా ఎలాంటివాడు అన్న వివరాలు మనకు ఇయ్యబడలేదు. వంశావళుల గురించి ప్రత్యేకంగా చెప్పబడిన ఈ గ్రంథంలో ఈ అంశం ప్రాముఖ్యమైంది. ఈ వివరములను మోషే వ్రాశాడు. యాజకులను గురించిన నియమ నిబంధనలను గురించి ఎంతో నిక్కచ్చిగానున్న ఇతడు మెల్కీసెదెకు ఎలా యాజకుడు అయ్యాడు అన్న వివరాన్ని మాత్రం ఇవ్వకపోవడం గమనార్హం. దైవావేశితుడయిన హెబ్రీ పత్రిక గ్రంథకర్త ఈ విషయాన్ని బోధిస్తూ లేవీ యాజకత్వమునకు భిన్నంగా, మెల్కీసెదెకు వంశావళి మీద ఆధారపడినవాడు *కాదు* అని స్పష్టం చేస్తున్నాడు (3 వ.). అలాగే యేసు కూడ యూదా గోత్రంనుండి వచ్చి (14 వ.) మరియు మనకు ప్రధాన యాజకుడయ్యాడు.

**వారి కొనసాగే ధోరణి**

ఇదివరకటి వాదనను కొనసాగింపుగా, మెల్కీసెదెకు యాజకత్వము ఆగిపోయిందన్న వివరం ఏదీ లేదు కాబట్టి అతని యాజకత్వం కొనసాగుతూనే ఉందని చెప్పవచ్చు (3, 24 వచనాలు) – అదే విషయం యేసుని విషయంలోనూ సత్యం. యేసు నిరంతరము యాజకునిగానున్నాడు (16, 17, 25, 28 వచనాలు). ఇది లేవీ యాజకత్వమునకు భిన్నంగా ఉన్న అంశము (11, 12 వచనాలు).

**వారి గొప్ప స్వభావం**

ఈ చర్చలో ఇదే ప్రాముఖ్య విషయం. యూదా క్రైస్తవులు, క్రైస్తవేతర యూదుల కంటే తక్కువ వారమని భావించనక్కర్లేదు. క్రైస్తవులు ప్రధాన యాజకుని కలిగియుండడమే గాకుండా, వారి యాజక వ్యవస్థ యూదుల వ్యవస్థ కంటే గొప్పదిగా కలిగియున్నారు.[4] లేవీ యాజకత్వము కంటే మెల్కీసెదెకు యాజకత్వము ఎలా గొప్పది అన్న విషయమును గురించి గ్రంథకర్త ఈ వాదనలను తెలియజేస్తున్నాడు:

- తండ్రియైన అబ్రాహాము సహితం తన కొల్లసొమ్ములో పదియవవంతును మెల్కీసెదెకుకు ఇచ్చాడు (4 వ.).
- మెల్కీసెదెకు అబ్రాహామును దీవించాడు (గొప్పతనముకు గుర్తు) (6, 7 వచనాలు).
- ఒకవిధంగా లేవీ (తన తాతయైన అబ్రాహాము ద్వారా) మెల్కీసెదెకుకు పదియవ వంతును ఇచ్చాడు.
- లేవీ యాజకత్వం అసంపూర్ణతను లేదా (11, 19 వచనాలు), మెల్కీసెదెకు

క్రమంలోని క్రీస్తు యాజకత్వం పరిపూర్ణతను సాధించింది (19, 25 వచనాలు).

- ప్రమాణము లేకుండానే లేవీయులు యాజకులు కాగా, మెల్కీసెదెకు ప్రమాణమును గురించి కీర్తన 110:4 మాట్లాడుతుంది (హెబ్రీయులకు 7:20, 21).
- లేవీ యాజకులు అర్పణలు అర్పించవలసియుండగా, యేసు ఒక్కసారే అర్పించెను (27 వ.).

**వారిలోని ఒకే స్వభావం**

దైవావేశిత లేఖనముల ప్రకారం, పాత నిబంధనలో మెల్కీసెదెకు యాజక క్రమములో ఒకే యాజకుడు ఉన్నాడు. అయితే, లేవీ యాజక క్రమములో మాత్రం అనేకమంది మారుతూ వచ్చారు (23 వ.). విజ్ఞాపన కర్తగా ఆయన నిరంతరముగా జీవించుచున్నాడు (7:24, 25, 27) కాబట్టి ఆయన "ఒక్కసారే" అర్పణను (చూడు 10:10) అర్పించాడు మరియు నిరంతరము జీవిస్తున్నాడు గనుక మనకు యేసు అను ఒక్క ప్రధాన యాజకుడే చాలు (చూడు 2:17, 18; 4:14–16).

## ఒక్క విషయం

వాక్య భాగములలో ఒక దానిని చదువుతున్నప్పుడు గ్రంథకర్త యొక్క ఉద్దేశమును గ్రహించడం ఒక్కోసారి కష్టమవుతుంది. కానీ హెబ్రీయులకు 7వ అధ్యాయం విషయంలో ఆ సమస్య లేదు. ఎందుకంటే, గ్రంథకర్త దానిని స్పష్టం చేస్తున్నాడు. తరువాత అధ్యాయం ఈ మాటలతో ప్రారంభమవుతుంది:

> మేము వివరించుచున్న సంగతులలోని సారాంశమేదనగా, మనకు అట్టి ప్రధాన యాజకుడు ఒకడున్నాడు. ఆయన పరిశుద్ధాలయమునకు అనగా మనుష్యుడుకాక **ప్రభువే** స్థాపించిన నిజమైన గుడారమునకు పరిచారకుడైయుండి, పరలోకమందు మహామహుని సింహాసనమునకు కుడిపార్శ్వమున ఆసీనుడాయెను (8:1, 2).

"మెల్కీసెదెకు క్రమము చొప్పున యాజకుడయిన" ఆయన యాజకత్వం శ్రేష్ఠమైనది. ఆయన మనకు ప్రధాన యాజకుడైయున్నాడు. పరలోకంలో ఆయన మన పక్షాన పరిచర్య చేస్తున్నాడు. ఆయన పరిపూర్ణమైన అర్పణను ఒక్కసారే అర్పించుట చేత మన కొరకు పరిచర్య చేస్తున్నాడు (7:27; 9:14, 24–28). మన నిమిత్తం విజ్ఞాపన చేస్తూ మనకు పరిచర్య చేస్తున్నాడు (4:14–16). "యాజకుడు" అన్న మాటకుగల లాటిన్ పదమునకు (*pontifex*) "సంధి చేయువాడు" (bridge builder)[5] అని అర్థము. తన మరణం, విజ్ఞాపన ద్వారా యేసు మనకు, దేవునికి మధ్య సంధి చేస్తున్నాడు. ఒక రచయిత చెప్పినట్లు ఆయన మన "ప్రధాన మంత్రి."[6]

---

## ఉపదేశకులకు సూచన

ఈ పాఠమునకు "మర్మయుక్త మెల్కీసెదెకు" అన్న పేరు కూడ పెట్టవచ్చు. "ఘనాహారం తీసుకోవడానికి మీరు సిద్ధమేనా?" అన్న పేరును కూడ ఆలోచించండి.

1983లో టెక్సాస్‌లోని డెంటాన్‌లో ఒక తరగతిలో "మెల్కీసెదెకు క్రమము చొప్పున ..."

అన్న ఒక పాఠమును Winifred Clark చెప్పాడు.[7] అలాగే G. C. Brewer, తన ప్రసంగముల పుస్తకంలో "క్రైస్తవుల ప్రధానయాజకుడు క్రీస్తు" అన్న పాఠమును బోధించాడు.[8]

సూచనలు

[1]ఈ విభాగంలోని మూడు శీర్షికలు Winifred Clark యొక్క "After the Order of Melchizedek" నుండి తీసుకోబడ్డాయి, *Second Annual Denton Lectures* (1983): 123-30. [2]ఇది ఒక రాజరిక కీర్తన. దావీదు, అతని సంతతికి వర్తించేది. ఇది దావీదు కుమారుడైన యేసునకు వర్తిస్తుంది. [3]ఈ పాఠములో లభించే చార్టును చూడండి. [4]"క్రైస్తవ్యం గొప్పది" అన్న మన తరువాత పాఠంలో ఈ మాటకు సంబంధించిన కొన్ని విషయాలు ఇయ్యబడ్డాయి. [5]William Barclay, *The Letter to the Hebrews,* 3d ed., rev. and updated, The New Daily Study Bible (Louisville: Westminster John Knox Press, 2002), 37. [6]Robert Milligan, *Epistle to the Hebrews* (Nashville: Gospel Advocate Co., 1954), 218. [7]Clark.[8]G. C. Brewer, *Brewer's Sermons: Christ Crucified* (Nashville: B. C. Goodpasture, 1952), 119-36.

| మెల్కీసెదెకు యాజకత్వం: ఛాయ | యేసుని యాజకత్వం: నిజం |
|---|---|
| రాజు మరియు యాజకుడు (7:1) | యాజకుడు మరియు రాజు (చూడు 1 తిమోతి 6:15) |
| నీతి, శాంతి వంటి లక్షణాలున్నాయి (7:2) | జీవితపు మంచి లక్షణాలు (7:16, 27) |
| లేవీ గ్రోతం కాదు (7:3ఎ) | లేవీ గోత్రంనుండి కాదు (7:14) |
| యాజకత్వం ముగిసిందనుటకు *రికార్డు* లేదు (7:3బి) | "నిరంతరము" యాజకత్వం (7:16, 17, 25, 28) |
| లేవీ యాజకత్వం కంటే శ్రేష్ఠమైనది (7:7) | శ్రేష్ఠమైన యాజకత్వం (చూడు 9:11) |
| వాక్యంలో క్రీస్తుకు సంబంధించి పోల్చగల ఒక్కడే యాజకుడు (7:1–8:2) | ఈనాడు అవసరమైన ఒకే యాజకుడు (చూడు 10:10) |